క్లుప్తంగా

రిజిస్ట్రేషన్ పత్రాల అందజేత



రిజిస్ట్రేషన్ పత్రాలు అందుకున్న లబ్ధిదారులు

ఏర్పేడు: మండలంలోని మర్రిమంద, కోబాకలో సోమవారం జగనన్న కాలనీల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. మర్రిమందలో 250 మంది మహిళలు, కోబాకలో 18 మందికి రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా నాయకుడు సుధీర్‌కుమార్, సర్పంచ్‌లు మేరీ గ్లోరీ, బుజ్జమ్మ, వైస్ సర్పంచ్ మణి, ఎంపీటీసీ సభ్యుడు నాగరా జురెడ్డి, నాయకులు చెంగల్‌రాయులు, జయప్రకాష్, ధనుంజయ రెడ్డి, వెంకటముని, హేమాద్రి, ఏకాంబరరెడ్డి, రాజీవ్ వీఆర్వో వెంకటరమణ, కార్యదర్శి లతాశ్రీ పాల్గొన్నారు.

7న మెగా జాబ్ మేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో ఈనెల 7వ తేదీ గురువారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కార్యా లయం సోమవారం తెలిపింది. ఈమేళాకు 13 బహుళ జాతీయ కంపెనీల్లో వివిధ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. 5వ తరగతి, 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడి యెట్, ఏదేని డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణత సాధించిన యువతీ యువకులు అర్హులు. ఆధార్ కార్డు జిరాక్స్, ఐదు బయోడేటా ఫారాలు, సర్టిఫికెట్ల జిరాక్సులను ఇంటర్వ్యూకు తీసుకురావాలి. సంబంధిత రిజిస్ట్రేషన్ లింకులో ఆధార్ ఓటీపీతో తప్పనిసరిగ పేరు నమోదుచేసుకోవాలి. వివరాల కోసం 7989509540, 8919889609 నంబర్లను సంప్రదించ వచ్చు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ, కనమనంబేడు పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దార్ పటాన్ మహ్మద్ అలీఖాన్, డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబు నాయుడు పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఫారం–7కు డబుల్ ఎంట్రీలు, డూప్లికేట్, మరణించిన ఓట్లను వారి బీఎల్వోలు మరోసారి క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఫారం–8 దరఖాస్తులను తన వద్దకు తీసుకురావాలని, క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలకు రంగులు వేయించాలని, పోలింగ్ కేంద్రం నంబర్, ఈఆర్ఓ, ఆర్ఓ, ఏఈఆర్ఓ, బీఎల్ఓ, ఎస్‌హెచ్ఓల హోదా, ఫోన్ నంబర్లు తప్పనిసరిగా రాయించాలని చెప్పారు. పోలింగ్ స్టేషన్లలో సౌకర్యాలను కల్పించాలని తెలిపారు. బీఎల్వోలు, వీఆర్వోఓ పాల్గొన్నారు.

15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

సత్యవేడు: మండలంలోని 28 పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1,02,93,245 మంజూరైనట్లు ఈఓపీఆర్డీ మునిరవి కుమార్ తెలిపారు. ఈ నిధులను తాగునీటి అవసరాలు, మోటార్ల నిర్వహణ, కరెంటు బిల్లు, డ్రైనేజీలు, కల్వర్టు నిర్మాణాలకు వినియోగించాలన్నారు.

సాంకేతికతో సామర్థ్యాలు పెరగాలి



ట్యాబ్‌లపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓలు

బుచ్చినాయుడుకండ్రిగ: కాలనుగుణంగా సాంకేతిక విద్యా బోధనతో సామర్థ్యాలు పెంచుకోవాలని ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తెలిపారు. బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌ల వినియోగంపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దీటుగా రాణించాలని సూచించారు.

సిపాయి భరోసా అందజేత



సరుకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

శ్రీకాళహస్తి: మండలంలోని గోవిందరావుపల్లె పంచాయతీ మాదవగిరిపల్లెకు చెందిన సిద్ధయ్య కుటుంబానికి సిపాయి భరోసా అందింది. సిద్ధయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబ పరిస్థితులు తెలుసుకున్న రష్ అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సోమవారం ఆ గ్రామానికి వెళ్లారు. మృతుని కుటుంబ సభ్యులకు 42 రకాల నిత్యావసర సరకులను అందజేశారు.

చెన్నేరిలో వసతుల కల్పన



సిమెంటు రోడ్డు

సత్యవేడు: మండలంలోని దాసుకుప్పం పంచాయతీ చెన్నేరి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు సర్పంచ్ రవి రెడ్డి తెలిపారు. తాజాగా పంచాయతీ నిధులు రూ.4 లక్షలు వెచ్చించి శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం వీధిలో 102 మీటర్ల సిమెంటు రోడ్డు వేసినట్లు తెలిపారు.

బ్రహ్మోత్సవ కాంతులు





సోమవారం ఉదయం వెండి అంబారీలపై విహరిస్తున్న గంగాదేవీ సమేత సోమస్కందమూర్తి, శ్రీజ్ఞానప్రసూనాంబ అమ్మవారు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయం, పరిసరాలు విద్యుద్దీపకాంతులీనుతున్నాయి. సోమవారం సాయంత్రం శ్రీస్వామివారి ధ్వజారోహణం ఆగమోక్తంగా నిర్వహించారు. ఉదయం శ్రీస్వామి, అమ్మవార్లు వెండి అంబారీలపై పురవీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధూర్జటి కళాప్రాంగణంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు రంజింపజేశాయి. చెన్నైకి చెందిన శ్రోతస్విని బృందం ఆలపించిన భక్తిగీతాల కార్యక్రమం భక్తిరంజని అలరించింది. శ్రీకాళహస్తికి చెందిన లావణ్య బృందం, కాణిపాకానికి చెందిన తేజశ్రీ బృందం నృత్యప్రదర్శనలు ఓలలాడించాయి. రాత్రి శివపార్వతుల కల్యాణం పౌరాణిక భక్తి రస పద్య నాటకం వీక్షకులను తన్మయులను చేసింది. ఆద్యంతం సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను భక్తిసాగరంలో కట్టిపడేశాయి. కళాకారులను దుశ్శాలువ, ప్రశంసాపత్రాలతో ఆలయాధికారులు సత్కరించారు.

ముక్కంటి సేవలో ఉప ముఖ్యమంత్రి

శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో ఎస్వీ నాగేశ్వరరావు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. శ్రీస్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు రెండో తిరునాళ్ల సందర్భంగా ఉదయం సూర్యప్రభ, చప్పర వాహన సేవలు, రాత్రి భూత, శుక వాహనాలపై స్వామి,అమ్మవార్లు విహరిస్తూ భక్తులను కనువిందు చేయనున్నారు.





వాహనసేవలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి



శ్రీకాళహస్తికి చెందిన లావణ్య బృందం నృత్య ప్రదర్శన



కాణిపాకం తేజశ్రీ బృందం నృత్యం



యాగశాలలో విశేష హారతి



స్వామి, అమ్మవార్ల విద్యుద్దీపాల కటౌట్





వాహన సేవలో సాంస్కృతిక సందడి, ఆలయంలో కుటుంబ సభ్యులతో డిప్యూటీ సీఎం నారాయణస్వామి



శివపార్వతుల కల్యాణం పౌరాణిక పద్య నాటకం



శ్రోతస్విని బృందం భక్తి గీతాల ఆలాపన

జగనన్నతోనే అన్ని వర్గాలకు సమన్యాయం



రాచగున్నేరిలో ప్రచారం చేస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి: అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ తొట్టంబేడు మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. సిద్ధం కార్యక్రమంలో భాగంగా మండలంలోని రాచగున్నేరి ఎస్సీకాలనీలో సోమవారం ఆమె ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె అన్ని వర్గాల వారికి రాజకీయ పదవులు ఇస్తూ సీఎం జగనన్న సమన్యాయం పాటిస్తున్నారని తెలిపారు. అర్హతే ప్రమాణికంగా కుల, మత, పార్టీలకతీతంగా పథకాలను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిననాటి నుంచి బియ్యపు మధుసూదన్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరిస్తున్నారని తెలిపారు. 30 సంవత్సరాల్లో జరగని అభివృద్ధి నాలుగున్నర ఏళ్లలో చేసి చూపించిటన్లు పేర్కొన్నారు. కరోనా కష్ట కాలంలో కొందరు నాయకులు ఎక్కడో పక్క రాష్ట్రంలో తలదాచుకుంటే ప్రజలకు అండగా ఉంటూ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి రూ.కోట్లతో పలు సహాయ కార్యక్రమాలు నిర్వహించారని చెప్పారు. ఈలాంటి సంక్షేమ పాలన కావాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల ఇన్‌ఛార్జి వయ్యాల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ భాను యాదవ్, మిల్క్ సొసైటీ చైర్మన్ మధుసూదన్‌రావు, రామచంద్రయ్య, పోలయ్య, బాబు, భాస్కర్, షణ్ముగం, మోహన్, పవన్, మునిరాజ, మదన్‌మోహన్‌రెడ్డి, అంకయ్య, వెంకటేశ్వర్లు, రామిరెడ్డి, మనోహర్‌రెడ్డి, గురునాథరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మునిరాజ పాల్గొన్నారు.

భూత వాహనంపై పల్లికొండేశ్వరస్వామి



నాగలాపురం: ప్రసిద్ధ శ్రీసురుటుపల్లి శ్రీసర్వమంగళ సమేత పల్లికొండేశ్వరస్వామి ఆలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు సోమవారం స్వామి వారు భూత వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకల్ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు, పరివార దేవతలకు అభిషేక పూజలు నిర్వహించారు. యాగశాల పూజలు చేపట్టారు. సాయంత్రం శ్రీవాల్మీకేశ్వరస్వామి, మరకదాంబిక అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పంచామృత అభిషేకం నిర్వహించి, ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలు, సుగంధ భరిత పుష్పమాలికలతో సుందరంగా ముస్తాబు చేసి మహాహారతి చేపట్టారు. అనంతరం భూత వాహనంపై కొలువుదీర్చి, మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల సందడి నడుమ తిరువీధి ఉత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరంజనాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీరెడ్డి, కార్య నిర్వహణాధికారి కె.రామచంద్ర, ట్రస్టు బోర్డు మెంబర్లు ఈ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రైవేటులో 25శాతం ఉచిత సీట్లు

సత్యవేడు: రానున్న 2024–2025 విద్యాసంవత్సరంలో ప్రయివేటు,అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ఒకటవ తరగతిలో చేరే విధంగా విద్యార్థులకు సీట్లు కేటాయించాలని ఎంఈఓ కె.రవి తెలిపారు. పాఠశాల పరిధిలో దివ్యాంగులు, హెచ్‌ఐవి బాధిత పిల్లలు, అనాథ పిల్లలకు 5శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4శాతం, బలహీన వర్గాలబీసీ, మైనారిటీ, ఓసీ)కు 6శాతం సీట్లు కేటాయించాలన్నారు. ఏప్రిల్ 2, 2018 నుంచి మార్చి 2019 మధ్యలో జన్మించిన వారు ఉచిత ప్రవేశాలకు అర్హులు.1వ తరగతి ప్రవేశానికి సచివాలయం, ఎంఈఓ కార్యాలయంలో విద్యాశాఖ వెబ్‌సైట్ WWW.CSE.ap.gov.in పోర్టల్‌లో మార్చి 25 వరకు పేర్లు నమోదు చేసుకునే అవకాశం ఉంది. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లి దండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సూచించారు.

నేటి నుంచి గుడిమల్లం బ్రహ్మోత్సవాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దారు ఉదయ్‌భాస్కర్ రాజు, గున్నేరి కిషోర్‌రెడ్డి

ఏర్పేడు: మండలంలోని పురాతన గుడిమల్లం శ్రీపరశురామేశ్వర స్వామి ఆలయం మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈనెల 10వ తేదీ వరకు జరుగనున్న బ్రహ్మోత్సవాలకు భక్తుల కోసం ఆలయ చైర్మన్ నరసింహయాదవ్, ఈఓ రామచంద్రారెడ్డి విస్తృత ఏర్పాట్లు చేశారు. సోమవారం ఏర్పాట్లను తహసీల్దారు ఉదయ్‌భాస్కర్ రాజు, ఏర్పేడు సీఐ శ్రీరామశ్రీనివాసులు పరిశీలించారు. క్యూలు, చలువ పందిళ్లు, వాహనాల పార్కింగ్, భద్రత, భక్తులకు తాగునీరు, ప్రసాదాలు పంపిణీ తదితర అంశాలపై ఆలయ చైర్మన్, ఈఓతో చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం యాదవ్, నాయకులు దినేష్ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, శేఖర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

పల్స్ పోలియో 99 శాతం పూర్తి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో సోమవారం ఇంటింటికీ వెళ్లి సిబ్బంది పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు మండల వైద్యాధికారులు మాధవి, దివాకర్ తెలిపారు. మండలంలోని 28 పంచాయతీల్లో మొదటిరోజు వేసుకోని పిల్లలకు సోమవారం వేసినట్లు చెప్పారు. మండలంలో 0నుంచి ఐదేళ్లలోపు పిల్లలు 3,608 మంది ఉండగా, 3,572 మందికి పోలియో చుక్కలను వేసి, 99 శాతం పూర్తి చేసినట్లు వివరించారు.

జోరుగా వరవ కాలువ మరమ్మతులు



పనులు చేస్తున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధి హామీ పథకంలో మండల కేంద్రంలో చెరువు మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. 60 మంది కూలీలు చెట్టు పుట్టలను తొలగించి, పూడికతీత పనులు చేస్తున్నారు. చెరువు మరమ్మతులకు ఉపాధిలో రూ.4 లక్షలు మంజూరైనట్లు ఏపీఓ భానుప్రియ తెలిపారు. కూలీలకు రోజుకు రూ.250 కూలి గిట్టుబాటు అవుతుందని, 10 రోజుల పాటు పనులు జరుగుతాయన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి రూ.6 లక్షలు



బోరు వేసేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నాగలాపురం: మండలంలోని మిరపతోట, మసీదు సమీపం, రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంతాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి మూడు బోర్లు వేసేందుకు ఎంపీపీ నిధులు రూ.6లక్షలు కేటాయించారు. తాగునీటి సమస్యపై సర్పంచ్ సుధాకు ఆయా గ్రామస్తులు విన్నవించారు. సర్పంచ్ వెంటనే ఎంపీపీ శ్యామ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, మండల నాయకులతో చర్చించారు. ఎంపీపీ నిధులతో నీటి సమస్యను పరిష్కరించాలని తీర్మానించారు. సర్పంచ్ అధ్యక్షతన బోర్లు వేసేందుకు అనుకూలమైన ప్రాంతాన్ని నాయకులతో కలిసి పరిశీలించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు పంచాయతీ ముట్టంగి గిరిజనకాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. పలుమార్లు మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పట్టించుకోవడం లేదని స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు అంకమ్మ ఆరోపించారు. గ్రామంలో 70 కుటుంబాలు ఉన్నాయని, తాగునీటికి పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతంగా ఉంటున్నాయన్నారు. ఏర్పాటు చేయకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాలనీకి ప్రత్యేకంగా బోరు వేసి తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆమె కోరారు.

సురుటుపల్లి బ్రహ్మోత్సవాలకు రండి





టీటీడీ చైర్మన్ కరుణాకరరెడ్డిని, డిప్యూటీ సీఎం నారాయణస్వామిని ఆహ్వానిస్తున్న ఆలయ చైర్మన్

నాగలాపురం: సురుటుపల్లిలోని ప్రసిద్ధ శ్రీపల్లికొండేశ్వరస్వామి మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి, తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ ట్రస్టు బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులు ఆహ్వానించారు. సోమవారం తిరుపతిలోని వారి స్వగృహాలకు దేవస్థానం చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, కార్య నిర్వాహణ అధికారి కె.రామచంద్ర రెడ్డి, ట్రస్టు బోర్డు సభ్యుడు ఆనందయ్య వెళ్లారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు. ఆలయ అర్చకులు సతీష్ శర్మ వేద ఆశీర్వచనం చేసి, తీర్థ ప్రసాదాలను అందించారు. సురుటుపల్లి బ్రహ్మోత్సవాలకు ఏటా టీటీడీ తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తున్నామని, ఈ సంవత్సరం కూడా సమర్పిస్తామని కరుణాకరరెడ్డి తెలిపారు.

ప్రజలే జగనన్న ప్రచారాస్త్రాలు



పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న బియ్యపు శ్రీవాణిరెడ్డి

శ్రీకాళహస్తి: రానున్న ఎన్నికల్లో ప్రజలే జగనన్నకు ప్రచార అస్త్రాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి సతీమణి బియ్యపు శ్రీవాణిరెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఆమె తొట్టంబేడు మండలం ఎగువ సాంబయ్యపాళెం, దిగువ సాంబయ్యపాళెం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాము ఏ గ్రామానికి వెళ్లినా తామంతా జగనన్న సంక్షేమ పథకాలతో బాగున్నామని, జగనన్నకే తమ మద్దతని చెప్పడం ఎంతో ఆనందాన్ని ఇస్తోందని తెలిపారు. ఎన్నికల్లో జగనన్నను ఎదుర్కొనేందుకు ఎంతమంది ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు ఓటు అనే ఆయుధంతో భగ్నం చేయడం తప్పదని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ మండల నాయకుడు ఉన్నం వాసు దేవనాయుడు, ఎంపీపీ నిర్మలమ్మ, సర్పంచ్ సుజాతమ్మ, జగదీశ్వర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గెరటారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మణినాయుడు, నాయకులు కోవి చంద్రయ్యనాయుడు, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణకు చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న వైస్ చైర్మన్ మిద్దెల హరి

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండ్ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటామని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మిద్దెల హరి అన్నారు. సోమవారం ఆయన ఆర్టీసీ బస్టాండును పరిశీలించారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డికి తగు సూచనలు ఇచ్చారు. డిపో అభివృద్ధికి అధికారులతో చర్చించి తగు ప్రణాళికలను సూచించారు. ప్రణాళికలను సిద్ధం చేసి అందిస్తే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. శ్రీకాళహస్తి ఆలయ పట్టణం కావడంతో ఆ స్థాయిలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. అంతకు ముందు డిపో మేనేజర్ రాజవర్ధన్‌రెడ్డి, పలు యూనియన్ల నాయకులు స్వాగతం పలికారు.

సచివాలయ స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో

వరదయ్యపాళెం: మండలంలోని పెద్ద పాండూరు గ్రామ సచివాలయ స్థలాన్ని ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఉదయ భారతి హెచ్చరించారు. ఈమేరకు సోమవారం ఆక్రమణకు గురైన స్థలంలో హెచ్చరిక బోర్డును వీఆర్వో ఆదిలక్ష్మి ఏర్పాటు చేశారు. సచివాలయ స్థలాన్ని స్థానిక రైతు ఒకరు అక్రమించి దుక్కి దున్నకాలు చేశాడు. సచివాలయానికి కనీసం దారి కూడా లేకుండా ఆక్రమిస్తుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఆయన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయించారు. ఆక్రమణలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.